


# 65 వ భాగం

## దక్ష ప్రజాపతి – 14

## దక్షయజ్ఞం పరిసమాప్తి

యజ్ఞం పూర్తి అయింది. దక్షుడికి అహంకారంతోకూడిన మనసు పోయి భగవద్దర్శనం అయింది. ఇంక మిగిలినది కనిపించిన భగవంతుడికి కృతజ్ఞత తెలుపుకోవడం, మరోసారి ఇలా జరగకుండా చూడమని ప్రార్ధించడం. ఇప్పుడు జరిగేది అదే.

ఉ. ఆ నళినాయతాక్షుని యనంత పరాక్రమ దుర్నిరీక్ష్య తే
జో నిహతస్వదీప్తు లగుచున్నుతిసేయ నశక్తులై భయ
గ్లాని వహించి బాష్పములు గ్రమ్మఁగ గద్గదకంఠులై తనుల్
ప్రామపడంగ నవ్విభుని మన్ననఁ గైకొని యెట్టకేలకున్. [4-169]

వ. నిటలతట ఘటిత కరపుటులై యమ్మహాత్ముని యపార మహిమం బెఱిఁగి నుతియింప శక్తులుగాక యుండియుఁ, గృతానుగ్రహవిగ్రహుం డగుటం జేసి తమతమ మతులకు గోచరించిన కొలంది నుతియింపఁ దొడంగిరి; అందు గృహీతంబు లగు పూజాద్యుపచారంబులు గలిగి బ్రహ్మాదులకు జనకుండును, సునంద నందాది పరమభాగవతజన సేవితుండును, యజ్ఞేశ్వరుండును నగు భగవంతుని శరణ్యునింగాఁ దలంచి దక్షుం డిట్లనియె; "దేవా! నీవు స్వస్వరూపంబునం దున్న యప్పుడు పరతంబులుగాని రాగాద్యఖిలబుద్ధ్యవస్థలచే విముక్తుండవును, నద్వితీయుండవును, జిద్రూపకుండవును, భయరహితుండవును నై మాయం దిరస్కరించి మఱియు నా మాయ ననుసరించుచు లీలామానుషరూపంబుల నంగీకరించి స్వతంత్రుండ వయ్యును, మాయా పరతంత్రుడవై రాగాది యుక్తుండునుం బోలె రామకృష్ణాద్యవతారంబులఁ గానంబడుచుందువు; కావున నీ లోకంబులకు నీవ యీశ్వరుండవనియు నితరులైన బ్రహ్మరుద్రాదులు భవన్మాయా విభూతు లగుటం జేసి లోకంబులకు నీశ్వరులుగా రనియును భేదదృష్టి గల నన్ను రక్షింపుము; ఈ విశ్వకారణు లైన ఫాలలోచనుండును బ్రహ్మయు దిక్పాలురును సకల చరాచర జంతువులును నీవ; భవద్వ్యతిరిక్తంబు జగంబున లే" దని విన్నవించినం దదనంతరంబ ఋత్విగ్గణంబు లిట్లనిరి. [4-170]

దక్షుడు ఇప్పుడు విష్ణువుతో చెప్తున్నాడు – నువు రాగద్వేషాలకి అతీతుడవీ, నిర్భయుడవీ, చిద్రూపుడవీను. మాయకి అతీతుడవైనా లీలామానుషరూపం ధరించినప్పుడు మాయకి లోబడినట్టు కనబడుతూ ఉంటావు. ఈ లోకాలన్నింటికీ నువ్వే ప్రభువు వనీ ఇతరులైన బ్రహ్మ రుద్రాదులు వేరనీ, ప్రభువులు కారనీ అనుకునే నా భేధదృష్టి మన్నించి రక్షించు. విశ్వకారకులైన ఈ బ్రహ్మ రుద్రాదులు కూడా నీ రూపాలే అని ఇప్పుడు తెలిసి వచ్చింది.

పోతన భాగవతంలో ఇక్కడ దక్ష యజ్ఞంలో కూడా బ్రహ్మాది దేవతలు విష్ణువుని చూసాక – హిరణ్యకశిపుణ్ణి అంతం చేసాక బ్రహ్మాది దేవతలూ, ఇంద్రుడూ, రుద్రుడూ మొదలైన వారు విష్ణువుని స్తోత్రం చేసినట్టూ – స్తోత్రం చేయడం గమనించవచ్చు. దక్షుడు ఇలా అన్నాక, ఋత్విక్కులు చెప్తున్నారు.

సీ. వామదేవుని శాపవశమునఁ జేసి క;
ర్మానువర్తులము మే మైన కతన
బలసి వేదప్రతిపాద్య ధర్మోపల;
క్ష్యంబైన యట్టి మఖంబునందు
దీపింప నింద్రాది దేవతా కలిత రూ;
పవ్యాజమునఁ బొంది పరఁగ నిన్ను
యజ్ఞస్వరూపుండ వని కాని కేవల;
నిర్గుణుండవు నిత్యనిర్మలుఁడవు [4-171]

తే. నరయ ననవద్యమూర్తివి యైన నీదు
లలిత తత్త్వస్వరూపంబుఁ దెలియఁజాల
మయ్య మాధవ! గోవింద! హరి! ముకుంద!
చిన్మయాకార! నిత్యలక్ష్మీవిహార! [4-171.1]

మేము నందీశ్వరుడి (వామదేవుడు) శాపం వల్ల ఇలా యజ్ఞాది కర్మలలో ఆసక్తులం అయ్యాం. వేదాల్లో చెప్పబడిన ధర్మ లక్షణాలు కలది ఈ యజ్ఞం. మళ్ళీ ఇంద్రాది దేవతలుగా కనబడేది నీవే. మేము ఎంత ప్రయత్నం చేసినా నిర్గుణుడవు, నిత్యనిర్మలుడవీ అయిన నిన్ను గ్రహించలేము. పరమేశ్వరుడైన రుద్రుడిలా అంటున్నాడు.

చ. వరద! నిరీహ యోగిజన వర్గసు పూజిత! నీ పదాబ్జముల్
నిరతము నంతరంగమున నిల్పి భవత్సదనుగ్రహాదిక
స్ఫురణఁ దనర్చు నన్ను నతిమూఢు లవిద్యులు మున్నమంగళా
వరణుఁ డటంచుఁ బల్కిన భవన్మతి నే గణియింప నచ్యుతా! [4-175]

నిత్యం నీ పాదపద్మాలని మనసులో నింపుకుని నీ అనుగ్రహానికి నోచుకున్న నన్ను – లయకారుణ్ణి కనక – మూఢులు తెలుసుకోలేక, అమంగళుడని అంటూ ఉంటారు. అటువంటివి నేను లెక్క చేయను. ఇక్కడ శివుడు చెప్పినది చూస్తే తెలిసేదేమిటంటే, మనస్సనేది – అంతరంగలో – శుభ్రంగా ఉండడం ముఖ్యం. ఎందుకంటే భగవంతుణ్ణి దర్శించాలంటే ముందు ఎక్కడ చూడాలి? రమణులు చెప్పినట్టూ 'నేనెవరిని,' అంటూ తన మనసులోకే చూడవలిసింది. ఆ మనస్సనేది శుభ్రంగా ఉంటే బాహ్యాంతరం ఎలా ఉన్నా ఫర్వాలేదు కదా? బ్రహ్మ ఏమంటున్నాడంటే,

సీ. తవిలి పదార్థభేదగ్రాహకము లైన;
చక్షురింద్రియముల సరవిఁ జూడఁ

గలుగు నీ రూపంబు గడఁగి మాయామయం;
బగు; నసద్వ్యతిరిక్త మగుచు మఱియు
జ్ఞానార్థ కారణ సత్త్వాది గుణముల;
కాశ్రయభూతమై యలరుచున్న
నిరుపమాకారంబు నీకు విలక్షణ;
మై యుండు ననుచు నే నాత్మఁ దలఁతు [4-179]

తే. నిర్వికార! నిరంజన! నిష్కళంక!
నిరతిశయ! నిష్క్రియారంభ! నిర్మలాత్మ!
విశ్వసంబోధ్య! నిరవద్య! వేదవేద్య!
ప్రవిమలానంద! సంసారభయవిదూర! [4-179.1]

భౌతికమైన నేత్రాలతో, ఇంద్రియాలతో నీ మాయాస్వరూపాన్ని మాత్రమే చూడగలం. సంపూర్ణం, జ్ఞానార్థాలకీ సత్త్వం మొదలైన గుణాలకీ నెలవైన, సాటిలేని విలక్షణమైన నీ రూపాన్ని జీవులు చూడలేరు. పోతన రాసిన ఈ సీస పద్యంమీద ఎత్తుగీతి ఎలా ఉందో గమనించారా? మొత్తం పదాలన్నీ విష్ణువు మహిమలే – నీవు నిర్వికారుడవు, నిరంజనుడవు. నిష్కళంకుడవు. సర్వేశ్వరుడవు. క్రియారహితుడవు. విమలాత్ముడవు. విశ్వవిధాతవు. నిరవద్యుడవు. వేదవేద్యుడవు. ఆనందస్వరూపుడవు. భవబంధాలను పటాపంచలు చేసేవాడవు – అని నిన్ను నిరుపమాన ఆకారంగా నా మనసులో తలుస్తూ ఉంటాను. ఇప్పుడు ఇంద్రుడిలా అంటున్నాడు.

మ. దితి సంతాన వినాశ సాధన సముద్దీప్తాష్ట బాహా సమ
న్వితమై యోగిమనోనురాగ పదమై వెల్గొందు నీ దేహ మా
యత మైనట్టి ప్రపంచముం బలెను మిథ్యాభూతముం గామి శా
శ్వతముంగా మదిలోఁ దలంతు హరి! దేవా! దైవచూడామణీ!" [4-181]

రాక్షసులని (దితి సంతానం) అంతమొందించే నీ ఎనిమిది భుజాలున్న, యోగీశ్వరులకి ఆనందం కలిగించే దేహం శాశ్వతమైనదిగా, ప్రపంచంలో మిగిలినవన్నీ మిథ్యాభూతాలుగా నేను మనసులో తలుస్తున్నాను దైవచూడామణీ. ఋత్విక్కుల పత్నులు ఇలా అన్నారు.

చ. కడఁగి భవత్పదార్చనకుఁ గా నిటు దక్షునిచే రచింపఁగాఁ
బడి శితికంఠరోషమున భస్మము నొంది పరేతభూమియై
చెడి కదు శాంతమేధమునఁ జెన్నఱియున్న మఖంబుఁ జూడు మే
ర్పడ జలజాభ నేత్రములఁ బావన మై విలసిల్లు నచ్యుతా! [4-183]

దక్షుడు యజ్ఞం మొదలుపెట్టినది నీ పాదార్చనకి. అయితే శివుడి కోపం వల్ల (శితికంఠ – నల్లని కంఠం కలవాడు) శ్మశానంగా కనిపిస్తోందిప్పుడు. ఒక్కసారి నువ్వు కళ్ళు విప్పి చూస్తే ఈ యాగధామం మళ్ళీ కళకళల్లాడుతుంది. ఋషులు ఇలా అంటున్నారు.

మ. అనఘా! మాధవ! నీవు మావలెనె కర్మారంభివై యుండియున్
విను తత్కర్మ ఫలంబు నొంద; వితరుల్ విశ్వంబునన్ భూతికై
యనయంబున్ భజియించు నిందిర గరం బర్థిన్ నినుం జేరఁ గై
కొన; వే మందుము నీ చరిత్రమునకున్ గోవింద! పద్మోదరా! [4-185]

పుణ్యాత్ముడైన (అనఘా) మాధవా, నువ్వు మావలె కర్మలు చేసినా, ఆ కర్మ ఫలం నీకు అంటదు. ఎంతోమంది సంపదలకోసం లక్ష్మీదేవిని అర్థిస్తూ ఉంటారు. కానీ ఆ లక్ష్మి నిన్ను అర్థిస్తే నువ్వు చేరదీయవు. అంటే నువ్వు అటు కర్మలకీ ఇటు సంపదలకీ అతీతుడవు. సిద్ధులు ఇలా అంటున్నారు.

చ. హరి! భవ దుఃఖ భీషణ దవానల దగ్ధతృషార్త మన్మనో
ద్విరదము శోభితంబును బవిత్రము నైన భవత్కథా సుధా
సరి దవగాహనంబునను సంసృతి తాపము వాసి క్రమ్మఱం
దిరుగదు బ్రహ్మముం గనిన ధీరుని భంగిఁ బయోరుహోదరా! [4-187]

సంసారమనే అగ్నిలో చిక్కుకుని దాహంతో ఉన్న ఏనుగులాగా అయిన మా మనస్సులు నీ పవిత్రమైన కథలనే నదిలో తాపం తీర్చుకుంటున్నాయి. అక్కడనుంచి, బ్రహ్మన్ని కనుగొన్న ధీరుడైన యోగిలాగా వెనక్కి రావడానికి ఇష్టపడడం లేదు. ఈ పద్యంలో 'ఏనుగు' అనే పదం ఎక్కడుందో చెప్పగలరా? "ద్విరదము" అంటే ఏనుగు. ఏదో సమయం అనుకూలించినప్పుడు కవిత్వం రాయడం వేరూ, ప్రాస కోసం పదాలు వెతుక్కుంటూ రాయడం వేరూ, పలికించెడు వాడు రామభద్రుడనుకుంటూ రాయడం వేరూ అని తెలిసి వస్తోంది కదా? అగ్నిదేవుడిలా అన్నాడు.

మ. హవరక్షా చరణుండ వై నెగడు దీ; వయ్యగ్నిహోత్రాది పం
చవిధంబున్ మఱి మంత్రపంచక సుసృష్టంబై తగంబొల్చు నా
హవరూపం బగు నీకు మ్రొక్కెదను; నీ యాజ్ఞన్ భువిన్ హవ్యముల్
సవనవ్రాతములన్ వహింతు హరి! యుష్మత్తేజముం బూనుచున్. [4-197]

యజ్ఞాలని రక్షించేది నీవే. అయిదు అగ్నిహోత్రాలు, అయిదు మంత్రాలున్న యజ్ఞ రూపం కూడా నీవే. నీ ఆజ్ఞ చేతే నేను ఈ హవ్యాలని భక్షిస్తూ ఉంటాను. ఇదే మంత్రపుష్పంలో చెప్పే – నారాయణ పరో ధ్యాతా, ధ్యానం నారాయణ పరః – అనేది. దేవతలిలా అన్నారు.

మ. మును కల్పాంతమునందుఁ గుక్షినఖిలంబున్ దాఁచి యేకాకివై
జనలోకోపరి లోకవాసులును యుష్మత్తత్త్వమార్గంబు చిం
తనముం జేయఁ బయోధియందు నహిరాట్తల్పంబునం బవ్వళిం
చిన నీ రూపము నేఁడు చూపితివి లక్ష్మీనాథ! దేవోత్తమా! [4-199]

కల్పాంతంలో అన్నీ కడుపులో దాచుకుని ఒక్కడివే ఉన్నప్పుడు పై లోకాల్లో ఉన్న సిద్ధపురుషులు తమ మనసులో నీ రూపాన్ని మననం చేసారు. అప్పుడు కనిపించిన పాల సముద్రంలో శేషతల్పం మీద పవళించిన నీ రూపం ఇప్పుడు మాకు మళ్ళీ చూపించావు.

క. అని తన్ను సకల జనములు
వినుతించిన హరి భవుండు విఘ్నము గావిం
చిన యా దక్షుని యజ్ఞము
ఘనముగఁ జెల్లించెఁ గొఱఁత గాకుండంగన్. [4-205]

క. సకలాత్ముఁడు దా నగుటను
సకల హవిర్భోక్త యయ్యు జలజాక్షుండుం
బ్రకటస్వభాగమున న
య్యకళంకుఁడు తృప్తిఁ బొంది యనె దక్షునితోన్. [4-206]

అందరూ ఇలా అనేసరికి శ్రీహరి దగ్గిరే ఉండి ఆ యజ్ఞం పూర్తి చేయించాడు. అందులో యజ్ఞం, భోక్త, చేయించేవాడూ అన్నీ తానై ఉండి కూడా, తన భాగంతోనే తృప్తి పడి దక్షుడితో ఇలా అన్నాడు.

వ. "అనఘా! యేనును బ్రహ్మయు శివుండు నీ జగంబులకుఁ గారణభూతులము; అందు నీశ్వరుఁడును, నుపద్రష్టయు స్వయంప్రకాశుండు నైన నేను గుణమయం బయిన యాత్మీయ మాయం బ్రవేశించి జనన వృద్ధి విలయంబులకు హేతుభూతంబు లగు తత్తత్క్రియోచితంబు లయిన బ్రహ్మరుద్రాది నామధేయంబుల నొందుచుండు; దట్టి యద్వితీయ బ్రహ్మరూపకుండ నైన నా యందు నజ భవాదులను భూతగణంబులను మూఢుం డగువాడు వేఱుగాఁ జూచు; మనుజుండు శరీరంబునకుఁ గరచరణాదులు వేఱుగాఁ దలంపని చందంబున మద్భక్తుం డగువాఁడు నా యందు భూతజాలంబు భిన్నంబుగాఁ దలంపఁడు; కావున మా మువ్వుర నెవ్వండు వేఱు చేయకుండు వాఁడు కృతార్థుండు" అని యానతిచ్చిన దక్షుండును.
[4-207]

పుణ్యాత్ముడా, నేను, బ్రహ్మ రుద్రులమూ ఈ జగాలకి కారణభూతులము. అందులో ఈశ్వరుడినైన నేను మాయతో జనన, వృద్ధి, విలయాలకి కారకుణ్ణి అవుతూ బ్రహ్మ, రుద్రాది పేరులతో పిలవబడుతున్నాను. అద్వితీయుడైన నన్ను ఈ భూత గణాలనీ, బ్రహ్మ రుద్రాదులనీ (అజభవాదులు) వేరుగా చూసేవాడు మూఢుడు. నా భక్తుడైనవాడు శరీరం కంటే కరచరణాలు వేరుగా చూడనట్టూ నన్ను వీరికంటే భిన్నంగా చూడడు. మా ముగ్గురనీ ఎవరు వేరుగా చూడడో వాడు కృతార్థుడు. ఈ వచనం మరోసారి పోతన విష్ణువు నోట దక్షుణ్ణి ఏమనిపించాడో గమనించారా? అనఘా – పుణ్యాత్ముడా. ఎందుకంటే ఎంత శివుడి కోపానికి గురైనా చివరకి ఆయన అనుగ్రహం సంపాదించాడు కదా అహంకారం పోగొట్టుకుని?

క. విని విష్ణు దేవతాకం
బనఁగాఁ ద్రికపాలకలిత మగు నా యాగం
బునఁ దగ నవ్విష్ణుని పద
వనజంబులు పూజ చేసి వారని భక్తిన్. [4-208]

ఇది విన్నాక దక్షుడు యజ్ఞం పూర్తి చేసి విష్ణు పాద పద్మాలకి భక్తితో అంకితం చేసాడు. పదవనజంబులు అంటే? వనము అంటే నీరు, వనజము – నీటిలో పుట్టినది, పద్మము. పదవనజంబులు– పాదపద్మాలు. మరి వారని భక్తిన్ అంటే? వారని – అంతులేని భక్తితో. పోతన "తె-లు-గు" లో రాసిన భాగవతం చదివి అర్థం చేసుకోవడానికి మనకున్న తెలుగు పరిజ్ఞానం సరిపోదనేది మరోసారి ఋజువైంది కదా?

సీ. అంగప్రధానక యాగంబులను జేసి;
యమరుల రుద్రుని నర్థిఁ బూజ
చేసి విశిష్టేష్ట శిష్టభాగమున ను;
దవసాన కర్మంబుఁ దవిలి తీర్చి
తాను ఋత్త్విక్కులుఁ దగ సోమపులఁ గూడి;
యవభృథ స్నానంబు లాచరించి
కడcక నవాప్త సకల ఫలకాముcడై;
తనరు దక్షునిఁ జూచి ధర్మబుద్ధి [4-210]

తే. గలిగి సుఖవృత్తి జీవింతుcగాక యనుచుఁ
బలికి దివిజులు మునులును బ్రాహ్మణులును
జనిరి నిజమందిరముల; కా జలజనయన
భవులు వేంచేసి రాత్మీయ భవనములకు. [4-210.1]

ఆ తర్వాత దక్షుడు మిగతా యాగాలు చేసి శివుడికి యాగ భాగం ఇచ్చాడు. యవభృధ స్నానం చేసి పూర్తిగా యాగ ఫలం పొందాడు. దేవతలు, మునులూ, బ్రహ్మవేత్తలూ 'ధర్మబుద్ధితో సుఖంగా జీవించు' అని ఆశీర్వదించి వారి చోటికి వెళ్ళారు. మిగిలినది సతీదేవి సంగతి. అది కూడా విదురుడితో మైత్రేయుడు చెప్తున్నాడు.

వ. అంత దాక్షాయణి యయిన సతీదేవి పూర్వకళేబరంబు విడిచి హిమవంతునకు మేనక యందు జనియించి విలయకాలంబునం బ్రసుప్తం బయిన శక్తి సృష్టికాలంబున నీశ్వరునిఁ బొందు చందంబునఁ బూర్వదయితుండగు రుద్రుని వరించె నని దక్షాధ్వర ధ్వంసకుండగు రుద్రుని చరిత్రంబు బృహస్పతి శిష్యుండైన యుద్ధవునకు నెఱింగించె; అతండు నాకుం జెప్పె; నేను నీకుం జెప్పితి;" అని మైత్రేయుండు వెండియు విదురున కిట్లనియె.
[4-211]

ఆ తర్వాత దాక్షాయణి మరో జన్మ ఎత్తి హిమవంతుడికి వల్ల మేనకకి పుట్టి, ప్రళయకాలంలో నియంత్రించబడిన శక్తి సృష్టికాలంలో ఈశ్వరుని పొందినట్టూ రుద్రుణ్ణి వరించి అర్ధనారీశ్వరి అయింది.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS